కవిత

# నేనో శరణార్థిని

- మహమ్మద్ రవూఫ్ బషీర్

నేనో శరణార్థినై వచ్చినందుకు
మిమ్ములను క్షమాపణలర్థిస్తున్నా!
నన్నొక మనిషిగా ఆమోదించండి
ఒక బానిసగా మాత్రం కాదు!

నన్నే తక్కువవానిగా చూడకండి!
ఎగాదిగా పరీక్షించకండి!
నేనో కవిని,
గోడలపై అతికించబడినవే అందుకు సాక్షీభూతాలు!
సుదూర ప్రాంత ప్రజలు వల్లిస్తుంటారు నా పద్యాలు!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

వాళ్ళు-నా కవితలను,
వానిని వేళ్ళాడదీసిన గోడలతోసహా నాశనం చేశారు!
వాళ్ళు-నా కవితలను దగ్ధంచేసిననాడే
కాలిపోయాను నేనూ వానితో పాటే!
వాళ్ళు-నా హృదయాన్ని బ్రద్దలు కొట్టారు,
నా ఆలోచనలను కొల్లగొట్టారు,
నా ప్రేవులను కెళ్ళగించారు!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

అయ్యా, మీరు అర్థంచేసుకోవటంలేదు నన్ను;
అర్థంచేసుకోలేకున్నాను మిమ్ములను నేను!
నేనో అరబ్బును-మీరు పరదేశీయులు
అయినా సైగలతో మనం సంభాషించగలం
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

నా దేశంలో స్వర్గం లేదు
ఉన్నది కేవలం నరకమే!
వాళ్ళు-భాషలన్నింటిలోని
అన్ని పదాలనూ మరచిపోయేట్లు చేశారు!

పదాలనెలా అవగతం చేసుకోవాలో
ఒకర్నొకరు ఎలా అర్థంచేసుకోవాలో మరచిపోయాం!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

నేనెవర్ని, నేనేమిటి.....
మీరడుగుతున్నారు నేనెవర్ననీ, నేనేమిటనీ!

గతం నాస్తి నాకు
నా వర్తమానం శూన్యం!
ఒక ముఖమన్నదే లేనివాడిని
మనిషి అవశేషాన్ని నేను!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

వాళ్ళు-ఆల్-జాతారీలో మమ్ములను చంపేశారు
ఇసుకలో సజీవంగా పూడ్చేశారు!
మేము తార్పుతూండగా
మా స్త్రీలు నేడు వ్యభిచారిణులు!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

అరబ్బుల తలుపు తట్టాను నేను;
షేక్‌ల, అమీర్ల, రాజుల తలుపుతట్టాను!
తరిమికొట్టారు వారంతా
మీ చెంతకు వచ్చి చేరాను!
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

ఎనభయ్యేవ పడిలోనున్న నన్ను
దేశ బహిష్కృతులై,
ప్రవాసంలోవున్న నా బిడ్డలు
తమ వాడు కాదని తోసిపుచ్చారు!
నాకు వ్యతిరేకంగా పోరాడారు
మీరు తప్ప మరెవరూ మిగల్లేదు నాకు
నన్నే శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

నా కుటుంబం, నా బిడ్డలు, నా బంధువులు
అందరూ నన్ను అమ్మి పారేశారు?
నా జీవితాన్ని దొంగిలించి, నన్ను మరిచి పోయారు!
నన్ను కూకటివేళ్ళతో పెళ్ళగించి వదలివేశారు,
విదేశీ రాయబార కార్యాలయ ద్వారాల ముందు
కృశించి, నశించేలా!

ఓ పరదేశీయుడా,

నన్నో శరణార్థిగా, మీలో ఒకనిగా అంగీకరిస్తారా?

తన ప్రభువుకు కృతజ్ఞతలు తెలిపే
అతి వినయ సేవానందాలు దౌర్భాగ్యం కదా!
నన్ను బయటకు తరిమిన
నా దేశపు బుద్ధిహీనులూ, నా బిడ్డలూ, నేరస్థులూ
నా ఇంటిని కాల్చి బుగ్గిచేశారు
నేను వారి క్రూరపీడన నుండి పారిపోయి
శరణార్థిగా మారి మీ మధ్య వున్నాను

**(ఈ వేదనా భరిత కవిత రాసిన ఎమ్.రవూఫ్ బషీర్ సిరియాకు చెందిన ప్రసిద్ధ కథారచయిత. 1974లో అరబ్ రచయితల సంఘంలో సభ్యుడిగా చేరాడు. 2013 నుంచీ ఆయన టర్కీలో ప్రవాస జీవితం గడుపుతున్నాడు. సిరియాలో చెలరేగిన ఆంతరంగిక కల్లోలంతో చలించి కవిత్వం రాయడం ప్రారంభించాడు. ఈ కవితను అరబిక్ భాషనుండి ఇంగ్లీషులోకి ఇంగ్లండ్‌కు చెందిన థామస్ అప్లిన్ అనువదించాడు. 1979లో పుట్టిన అప్లిన్ ప్రస్తుతం ఎడింబరో విశ్వవిద్యాలయంలో సౌదీ అరేబియన్ నవలా సాహిత్యంపై పరిశోధన చేస్తున్నాడు. దీన్ని తెలుగులోకి అనువదించినవారు కెఆర్బీ.)**

వలసలు మానవజాతి ప్రగతి చిత్రంలో చీకటి నీడలు. వలస జీవులకు చేయూతగా నిలవడం కనీస మానవతా ధర్మం. భయంతో, ఆకలితో మనిషి శరణార్థికావడం మానవజాతి చరిత్రకే మాయని మచ్చ

- ఐన్‌స్టీన్